సాక్షి నంద్యాల
మంగళవారం : 12 : డిసెంబర్ : 2023



నృత్య నీరాజనం

మహానంది: కార్తీక చివరి సోమవారం సందర్భంగా మహానందీశ్వర ఆలయ అలంకార మండపంలో నంద్యాల సాయి నాట్యాంజలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



మల్లన్న సేవలో..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దేవదాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్ కరికాల వలవన్ సోమవారం దర్శించుకున్నారు.



నీటి కుక్కల సందడి

శ్రీశైలం టెంపుల్: నీటిమట్టం తగ్గడంతో పాతాళ గంగలో మెట్ల మార్గంలో నీటి కుక్కలు సందడి చేశాయి. టూరిజం శాఖ ఏర్పాటు చేసిన జెట్‌పై ఆడుతూ కనువిందు చేశాయి.

శ్రీశైలం.. మహా దివ్య తేజం



- కార్తీకమాస చివరి సోమవారం శ్రీగిరికి పోటెత్తిన భక్తజనం
- దీపాలు వెలిగించి ప్రత్యేక నోములు నోచుకున్న భక్తులు
- దేదీప్యమానంగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి
- స్వామిఅమ్మవార్లను దర్శించి.. తరించిన భక్తజనం
- నేటితో ముగియనున్న కార్తీక మాసం



ఆధ్యాత్మిక కాంతులు.. శ్రీశైల ఆలయ పుష్కరిణి చుట్టూ భక్తులు వెలిగించిన దీపాల వరుస



ఆలయం ఎదుట దీపారాధన చేస్తున్న దంపతులు

శ్రీశైలంటెంపుల్: ఓం నమఃశివాయ, హర హర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తుల శివనామస్మరణ మారుమోగగా.. పరమేశ్వరునికి ప్రీతికరమైన కార్తీక మాసంలో మల్లన్న చెంత దీపాలు వెలిగించగా.. ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రం మహా దివ్యతేజంగా శోభిల్లింది. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ముక్కంటి దర్శనానికి వేలాది మంది భక్తులు శ్రీశైలానికి పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి బారులు దీరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువ జామున ఆలయ ద్వారాలను తెరిచి భక్తులను స్వామిఅమ్మవార్ల దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు స్వామిఅమ్మవార్ల అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం కల్పించారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఉచిత దర్శనానికి 6గంటలు, శీఘ్ర దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర(శివ)మాఢవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధనలో పలువురు భక్తులు దీపాలు వెలిగించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారంతో కార్తీక మాసం ముగియనుంది.

దేదీప్యమానంగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి

కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని లోక కల్యాణం కోసం ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతిని దేదీప్యమానంగా నిర్వహించారు. లక్షదీపోత్సవ కార్యక్రమంలో భాగంగా పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేయగా భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అలాగే సాయంత్రం 6.30 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు ఆశీనులు చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు చేపట్టారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను శాస్త్రోక్తంగా ఇచ్చారు. దశవిధహారతుల్లో ఓంకార హారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభ హారతి, నక్షత్రహారతి, కర్పూరహారతిలను ఉభయ దేవాలయాల అర్చకులు ఇచ్చారు. భక్తులు హారతులను కనులారా తిలకించి స్వామిఅమ్మవార్లను దర్శించి నేత్రానందభరితులయ్యారు. కార్తీకమాసంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ మాసంలో దీపారాధనే కాకుండా దీపదర్శనం కూడా ఎంతో పుణ్యదాయకమని పురాణాలు చెబుతున్నాయని పండితులు తెలిపారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కార్తీక దీపాలను వెలిగిస్తున్న ఆలయ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ పెద్దిరాజు తదితరులు



నాగహారతి ఇస్తున్న అర్చకుడు



పాతాళగంగలో దీపాలు వదులుతున్న భక్తులు



భక్తజనంతో కిక్కిరిసిన ఆలయ ప్రధాన వీధి

న్యూస్‌రీల్

నల్లమలలో ప్లాస్టిక్ వినియోగం నిషేధం



మాట్లాడుతున్న రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు

రుద్రవరం: పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూర్చే ప్లాస్టిక్ వినియోగాన్ని నల్లమల అటవీ ప్రాంతంలో జనవరి 1వ తేదీ నుంచి పూర్తిగా నిషేధిస్తున్నట్లు రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు తెలిపారు. స్థానిక అటవీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ అటవీ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు పడేయంతో వాటిని వన్యప్రాణులు తిని మృత్యువాత పడుతున్నాయన్నారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకుకుండా ప్లాస్టిక్ వస్తువులు అడ్డుపడటంతో భూగర్భజలాలు అడుగంటి పచ్చదనం తరిగిపోతుందన్నారు. ఈ సమస్య అహోబిలం కొండల్లో అధికంగా ఉందని, ఈ మేరకు ప్లాస్టిక్ నిషేధంపై భక్తుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారికి జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ రేంజి అధికారి ముర్తుజా పాల్గొన్నారు.

భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో సోమవారం సాయంత్రం ఉత్పాదన తిరిగి ప్రారంభమైంది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు ఆదివారం నుంచి సోమవారం వరకు 1,743 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 960 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 700 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 57.6979 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యామ్ నీటి మట్టం 837.10 అడుగులకు చేరుకుంది.

నేడు ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన మంగళవారం ధర్మకర్తల మండలి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. సమావేశంలో భక్తుల సౌకర్యార్థం, క్షేత్రాభివృద్ధికి సంబంధించి పలు అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొనేందుకు ఇప్పటికే చైర్మన్, సభ్యులు శ్రీశైలం చేరుకున్నారు.

క్వింటా ఎండు మిర్చి రూ. 22,300

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి మార్కెట్ యార్డులో ఎండు మిర్చి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సోమవారం సూపర్-10 రకం మిర్చి క్వింటాలు గరిష్ఠ ధర రూ.22,300, మధ్యస్థ ధర రూ.19,500, కనిష్ఠ ధర రూ.16,500 గా పలికినట్లు యార్డు కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

జొన్నల పంపిణీకి చర్యలు



చాగలమర్రిలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ జిల్లా అధికారి వెంకటరాముడు

చాగలమర్రి: రేషన్ కార్డుదారులకు జొన్నలు పంపిణీ చేసేందుకు జిల్లాలోని రైతుల నుంచి సేకరించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందని సివిల్ సప్లై జిల్లా అధికారి వెంకటరాముడు తెలిపారు. సోమవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం చాగలమర్రిలో జరుగుతున్న నిత్యావసర సరుకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1204 రేషన్ పంపిణీ దుకాణాలుండగా వాటి పరిధిలో 351ఎండీయూ ఆపరేటర్లు ఉన్నారని వివరించారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో నంద్యాల జిల్లాలో రైతులు పండించిన దాదాపు 3 వేల టన్నుల జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేసి 5 నెలల కాలంలో రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది ప్రస్తుతం జొన్నలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్ల వ్యవధిలో అక్రమంగా తరలిస్తున్న 4 వేల టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, ఈ బియ్యాన్ని వేలం నిర్వహించి విక్రయించామన్నారు. జిల్లాలో రేషన్ పంపిణీలో భాగంగా దాదాపు 300 టన్నుల కందిపప్పు వచ్చిందని తెలిపారు. ఆయన వెంట డీటీలు ప్రసాద్, విజయ్‌కుమార్ ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించండి



బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ఆరాతీస్తున్న మంత్రి బుగ్గన



బిల్ల సర్గం గుహలను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన


- ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- బేతంచెర్ల సీహెచ్‌సీలో సిజేరియన్లు ప్రారంభంతో వైద్యులకు అభినందన

బేతంచెర్ల: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన సందర్శించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీతో పాటు కాన్పుల వార్డును పరిశీలించి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ప్రజలను ఆరా తీశారు. కాన్పుల వార్డుతో పాటు సీహెచ్‌సీని పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు చరణ్ రాజ్, వంశీకృష్ణకు సూచించారు. వైద్య సిబ్బంది, పరికరాలు అవసరం అయితే వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. దుప్పట్లను పరిశుభ్రం చేయడానికి వాషింగ్ మిషన్ కొనుగోలు చేయాలన్నారు. ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. శేషారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంత్రి చొరవతో సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ కావడంతో రూ.2.29 కోట్లతో ఆధునికీకరించారు. ఈ క్రమంలో సోమవారం ఈ సీహెచ్‌సీలో మొదటి సారి డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన ఆదిలక్ష్మికి సిజేరియన్ చేయడంతో విజయవంతమై తల్లి, మగబిడ్డ క్షేమంగా ఉన్నారు. అదే సమయంలో అక్కడి చేరుకున్న మంత్రికి విషయం తెలిసి ఆపరేషన్ చేసిన గైనకాలజిస్టు సాగరిక, మత్తు వైద్యులు వెంకటేశ్వర్, వైద్యులు చరణ్ రాజు, వంశీకృష్ణ, స్టాఫ్ నర్స్ వసంతను అభినందించారు. అందరూ సమష్టిగా పని చేసి సీహెచ్‌సీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

పర్యాటక ప్రాంతంగా బిల్లసర్గం గుహలు

మండపరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామ సమీపాన ఉన్న బిల్లసర్గం గుహలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ గుహలను మంత్రి సోమవారం పరిశీలించారు. రూ.2.50 కోట్లతో చేపట్టిన గుహల అభివృద్ధి, రహదారి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జనవరి నెలఖారుకు ప్రారంభోత్సవం నేపథ్యంలో పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. గుహల సమీపంలో ఏర్పాటవుతున్న రెస్టారెంట్ పనులను పరిశీలించారు. ఇప్పటికే గుహలను సందర్శించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పర్యాటక కేంద్రానికి అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఉర్దూ అకాడమీ స్టేట్ డైరెక్టర్ మూర్తుజావలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, సంధానీ, ఖాజా, తిరుమలేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, వలీబాషా, రంగాపురం సర్పంచ్ రాజు, వైస్ ఎంపీపీ రంగస్వామి తదితరులు ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'తో ప్రతిభా క్రీడాకారుల గుర్తింపు



క్రీడా పరికరాలను అందజేస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభా క్రీడాకారులను వెలికితీయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహిస్తుందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఈనెల 15 నుంచి గ్రామ సచివాలయాల స్థాయిలో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రిని సోమవారం స్థానిక కార్యాలయంలో జెడ్పీచైర్మన్ సచివాలయాల సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాల కోటాలో అవకాశాలు వస్తాయని సూచించారు. 15 ఏళ్లు పైబడిన యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేసుకొని క్రీడా సంబరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి అతి పెద్ద క్రీడా సంబరాలు నిర్వహించలేదన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రకటించి ఇందులో భాగస్వామ్యం చేశారన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విజేతలకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. క్రీడాకారులు పెద్ద ఎత్తున పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకొని క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నందిపాడు సర్పంచ్ గుర్విరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కామిని గోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

లా నేస్తం.. న్యాయవాద వృత్తికి ప్రోత్సాహం

- యువ న్యాయవాదులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- ఈ ఏడాది రెండో విడత 'వైఎస్సార్ లా నేస్తం' నిధులు విడుదల చేసిన సీఎం జగన్
- జిల్లాలో 98 మంది జూనియర్ న్యాయవాదులకు రూ.29.40 లక్షల లబ్ధి
- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ మనజీర్, ఎమ్మెల్యే ఆర్థర్, హబీబుల్లా, పీపీ నాగిరెడ్డి తదితరులు

నంద్యాల: యువ న్యాయవాదులు ప్రభుత్వ ప్రోత్సాహంతో 'వైఎస్సార్ లా నేస్తం' ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని వృత్తిలో రాణించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఈ ఏడాది రెండో విడత 'వైఎస్సార్ లా నేస్తం' నిధులను బటన్ నొక్కి న్యాయవాదుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రంలో అర్హులైన 2,807 మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు చొప్పున 2023-24 సంవత్సరానికి రెండవ విడత ఆర్థిక సాయంగా జూలై 2023 నుంచి డిసెంబరు 2023 ఆరు నెలలకు గాను రూ.30 వేలు చొప్పున రూ.7.98 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, నందికొట్కూరు శాసన సభ్యులు తొగూరు ఆర్థర్, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, జూనియర్ అడ్వకేట్‌లు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వృత్తిపరంగా యువ న్యాయవాదుల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 98 మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేల చొప్పున రూ.29.40 లక్షల ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారని వివరించారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి 18 మంది లాయర్లకు రూ.5.40 లక్షలు, బనగానపల్లె నియోజకవర్గంలో 18 మందికి రూ.5.40 లక్షలు, డోన్ నియోజకవర్గంలో 15 మందికి రూ.4.50 లక్షలు, నందికొట్కూరు నియోజకవర్గంలో ఇద్దరికి రూ.60,000, నంద్యాల నియోజకవర్గంలో 37 మందికి రూ.11.10 లక్షలు, పాణ్యం నియోజకవర్గంలో ఒకరికి రూ.30,000, శ్రీశైల నియోజకవర్గంలో 7 మందికి రూ.2.10 లక్షలు చొప్పున మొత్తం 98 మంది యువ లాయర్లకు రూ.29.40 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. అనంతరం లబ్ధి పొందిన యువ లాయర్లకు 'వైఎస్సార్ లా నేస్తం' చెక్కును కలెక్టర్, ప్రజాప్రతినిధులు అందజేశారు.

న్యాయవాదుల సంక్షేమం సీఎం ఘనత



ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏ సీఎం చేయనటువంటి విధంగా న్యాయవాదులకు లబ్ధి చేకూర్చడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. గతం ప్రభుత్వాలు న్యాయవాదులకు ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించారు. కాని సీఎం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చి జూనియర్ న్యాయవాదులకు, న్యాయవాద సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించారు. అలాగే చనిపోయిన న్యాయవాదులకు బీమా సౌకర్యంతో పాటు మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.4 లక్షలు మంజూరు చేస్తుండటంతో పేద న్యాయవాద కుటుంబాలకు భరోసా దక్కింది.

– రామసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు, నంద్యాల

ఆనందదాయకం



ఏడాది పాటు లా నేస్తం పథకం పొందుతున్నాను. సీనియర్ న్యాయవాది వద్ద జూనియర్లుగా పని చేస్తున్న అనేక మందికి ఆదాయం ఉండదు. కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా వారు ఖర్చులకు సైతం ఇబ్బంది ఉంది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం స్టయిఫండ్ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

– హారిక, జూనియర్ న్యాయవాది, నంద్యాల

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఏడాదిన్నరకు లా నేస్తం కింద రూ.90వేలు నాఖాతాలో జమ అయ్యాయి. నెలకు రూ.5వేలు చొప్పున జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక సహాయం అందజేయడం సంతోషంగా ఉంది. ఈ డబ్బులు పుస్తకాలతో పాటు కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుంది. సీఎం జగన్‌కు నేను ఎంతో రుణపడి ఉంటాను.

–అంబేద్కర్, జూనియర్‌న్యాయవాది, నంద్యాల

లా నేస్తంతో వృత్తిలో రాణిస్తా



ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జూనియర్ న్యాయవాదుల కోసం ఏర్పాటు చేసిన లా నేస్తంతో వృత్తిలో రాణిస్తాను. మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నెలకు రూ.5వేలు చొప్పున అందజేస్తూ మమల్ని సీఎం ఎంతో ప్రోత్సహిస్తున్నారు.

– శిరోమణి, జూనియర్ న్యాయవాది, నంద్యాల

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పీఈటీ ఉద్యోగం ఇప్పిస్తానని రంగస్వామి అనే వ్యక్తి తన నుంచి రూ. 2 లక్షలు తీసుకుని మోసం చేశాడని, డబ్బు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని కోవెలకుంట్లకు చెందిన మధుసూదన్ జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి వినతులు అందుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం 71 వినతులు అందాయన్నారు. వాటిలో చట్టపరమైన సమస్యలపై నేరుగా ఆయా స్టేషన్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. సివిల్ తగాదాలకు సంబంధించిన సమస్యలను విచారించి కోర్టును ఆశ్రయించాల్సిందిగా సూచించామన్నారు. నకిలీ పత్రాలతో భూకబ్జాలకు పాల్పడేవారిపై, ఉద్యోగాల పేరుతో అమాయకుల నుంచి నగదు దండుకున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎస్పీ డీఎస్పీ సంతోష్, సీఐలు దస్తగిరిబాబు, సూర్యమౌళి, ఎస్సైలు హరినాథ్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.


ఆళ్లగడ్డ: కాచింతలలో వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


సంజామల: అక్కంపల్లెలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


బనగానపల్లె రూరల్: యాగంటిలో అన్నదానం చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


వెలుగోడు: వనభోజన కార్యక్రమంలో భోజనాలు వడ్డిస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

కార్తీకం.. మనోహరం

కార్తీక మాసం చివరి సోమవారం శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి.. ఓంకార నాదంతో మారుమోగాయి. కార్తీక దీపకాంతులతో శోభిల్లాయి. ఉదయం నుంచే ప్రముఖ ఆలయాల్లో 'కార్తీక' సందడి కనిపించింది. పుష్కరిణీల్లో పుణ్యస్నానాల అనంతరం ముక్కంటిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు పరమేశ్వరునికి అభిషేకాలు జరిపారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన చేశారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య క్షేత్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులతో దాతలు విరివిగా అన్నదాత కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షినెట్‌వర్క్


వెల్దుర్తి: చెరుకులపాడు శివాలయంలో పూజలు చేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



శ్రీశైలం: భక్తులతో కిక్కిరిసిన క్యూలు


కొత్తపల్లి: సంగమేశ్వరంలో పూజలు చేస్తున్న లోకాయుక్త జడ్జి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి దంపతులు


మహానంది: గోపూజ నిర్వహిస్తున్న పండితులు, అర్చకులు


సంజామల: భక్తులతో కిక్కిరిసిన నయనాలప్ప క్షేత్రం


శ్రీశైలం: పాతాళగంగ వద్ద భక్తుల రద్దీ


బనగానపల్లె రూరల్: యాగంటి పెద్దపుష్కరణిలో స్నానాలు చేస్తున్న భక్తులు


వెల్దుర్తి: భక్తులతో కిక్కిరిసిన బ్రహ్మగుండం క్షేత్రం


కర్నూలు: దేవనగర్ శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


నంద్యాల: ప్రత్యేక అలంకారంలో నాగలింగేశ్వరస్వామి


కర్నూలు: సప్తగిరినగర్ శివాలయంలో దీపారాధన


కర్నూలు: దీపారాధనలో మహిళలు


ఆళ్లగడ్డ: భక్తులతో పోటెత్తిన కాచింతల క్షేత్రం


నంద్యాల: అమ్మా స్పటిక లింగేశ్వర ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఇటుక గోడ మృత్యుపాశమై..

- ఇద్దరు మహిళలు దుర్మరణం
- కాల్వబుగ్గ ఇటుకల బట్టీలో దుర్ఘటన

ఓర్వకల్లు: బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకొని వలస వచ్చిన వారి పాలిట ఇటుక గోడ మృత్యుపాశమైంది. నీటి తొట్టికి అమర్చిన ఇటుక గోడ కూలిపడడంతో అక్కడే ఉన్న ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈ విషాద ఘటన మండలంలోని కాల్వబుగ్గ వద్ద ఇటుకల ఫ్యాక్టరీలో సోమవారం చోటుచేసుకోంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలం జీడిగుట్ట తండాకు చెందిన 20 కుటుంబాలతో పాటు జోగులాంబ గద్వాల జిల్లా, ఐజ మండలం సింధనూరు గ్రామానికి చెందిన మరో 20 కుటుంబాలు కాల్వబుగ్గ సమీపంలోని సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డికి చెందిన నెంబర్-1 లైట్‌వైట్ ఇటుకల ఫ్యాక్టరీలో ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నాయి. ఆయా కుటుంబాలకు చెందిన వారంతా 6 నెలలు ఇక్కడ పనిచేస్తే, మరో 6 నెలలు తమ సొంత గ్రామాల్లో పనిచేస్తూ జీవనం చేసేవారు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం పనుల్లోకి వచ్చారు. రోజు మాదిరిగానే ఉదయం వంట పనులు ముగించుకొని కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని నీటితొట్టి వద్దకు వెళ్లారు. జీడిగుట్ట తండాకు చెందిన రాజు, రమణిల కుమార్తె నందిని(14) మొహం కడుక్కుంటుండగా, సింధనూరుకు చెందిన తిమోతి భార్య సునీతమ్మ(30) దుస్తులు ఉతుకుతోంది. ఆ సమయంలో ఒక్కసారిగా నీటి తొట్టికి అమర్చిన ఆరడుగుల ఇటుకల గోడ వారిపై పడటంతో తీవ్రగాయాలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ యజమాని అక్కడికి చేరుకొని గాయపడిన ఇద్దరు మహిళలను తమ కారులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఒకరు మృతి చెందారు. ఆసుపత్రిలో మరొకరు ప్రాణాలు వదిలారు. దీంతో సదరు యజమాని వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.


ఇటుక గోడ కూలిన దృశ్యం



మృతి చెందిన సునీతమ్మ, నందిని (ఫైల్)

రూ.5 లక్షల పరిహారం చెల్లించాలి

ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు మహిళలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని మృతుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. పరిహారం చెల్లించేదాక మృతదేహాలకు పోస్టుమార్టం చేయనివ్వమని పట్టుపట్టారు. దీంతో ఫ్యాక్టరీ యజమానికి, మృతుల బంధువులకు మధ్య వాగ్వావాదం చోటుచేసుకోంది. పోలీసులు కల్పించుకొని ఇరువురికి సర్ది చెప్పారు.

రూ.7.75 లక్షల అపరాధ రుసుం వసూలు

- జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్

కర్నూలు (న్యూటౌన్): అక్రమ మైనింగ్‌కు పాల్పడిన పట్టుబడిన వాహనదారుల నుంచి రూ.7.75 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాణ్యం మండలం సుగాలిమెట్ట దగ్గర అక్టోబర్ నెల 30వ తేదీన రైల్వే పనులకు అక్రమ గ్రావెల్‌ను తరలించిన కారణంతో 4 టిప్పర్లను సీజ్ చేసి యజమాని శివప్రసాద్‌రెడ్డి నుంచి రూ.4లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. ప్రకాశం జిల్లా నుంచి తాడిపత్రికి గ్రానైట్‌ను అక్రమంగా తరలించిన లారీ యజమాని నాగేంద్ర నుంచి రూ.2.55 లక్షలు వసూలు చేశామన్నారు. గూడూరు మండలం చనుగొండ్ల దగ్గర అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించిన బోయ లక్ష్మన్న అనే వ్యక్తికి సంబంధించిన హిటాచీ, టిప్పర్‌ను సీజ్ చేసి రూ.1.10లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. రాయల్టీ పాస్ లేకుండా ఖనిజ రవాణా చేస్తున్న మీరాపురం ప్రతాపరెడ్డి నుంచి రూ.10వేలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

వాచ్‌మెన్ ఉద్యోగాల పేరుతో మోసం

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

కర్నూలు: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఉన్నతాధికారులు తనకు బాగా తెలుసని, అక్కడ వాచ్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తన దగ్గర రూ.1.20 లక్షలు, రంగన్న అనే వ్యక్తి నుంచి రూ.3 లక్షలు, చిన్నరాముడు నుంచి రూ.2.70 లక్షలు తీసుకుని తమ గ్రామానికి చెందిన చాకలి చిన్న నరసింహులు అనే వ్యక్తి మోసం చేశాడని దేవనకొండ మండలం అలారుదిన్నె గ్రామానికి చెందిన సూరప్ప ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి, వారితో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 86 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.


స్పందనలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- ఎమ్మిగనూరు మండలం చిలకలడోన గ్రామం దగ్గర ఉన్న కస్తూరిబా స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కొత్తాశంకు చెందిన లక్ష్మీదేవి రూ.1.50 లక్షలు డబ్బు తీసుకుని మోసం చేసిందని ఎమ్మిగనూరుకు చెందిన రాజు ఫిర్యాదు చేశారు.
- కర్నూలు రమ్యనగర్‌లో తనకూతురు రాసి ఇచ్చిన ప్లాట్‌లో ఇల్లు కట్టుకోవడానికి భూమి పూజ చేయడానికి వెళ్తే రవీంద్ర అనే వ్యక్తి గుడిసె వేసి ఆక్రమించుకోవడానికిప్రయత్నిస్తున్నాడని కర్నూలు రెవెన్యూ కాలనీకి చెందిన మంజుల ఫిర్యాదు చేశారు.
- తనపై దాడి చేసి, తన స్థలంలో కోడలు ఇల్లు నిర్మించుకుంటుందని, సంఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామానికి చెందిన కిష్టమ్మ ఫిర్యాదు చేశారు.
- తనకు తెలియకుండా అన్న కుమారులు రామాంజినేయులు, రామచంద్రుడు 3 ఎకరాల 55 సెంట్ల పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని చిప్పగిరి మండలం ఏరూరు గ్రామానికి చెందిన శ్రీరాములు ఫిర్యాదు చేశారు.
- ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు దగ్గర ఒక వ్యక్తి 1986లో ప్లాటు విక్రయించాడని, అయితే 2005లో అదే ప్లాట్‌ను వేరే వ్యక్తికి విక్రయించి తనకు మోసం చేశాడని ఎమ్మిగనూరుకు చెందిన నర్సయ్య శెట్టి ఫిర్యాదు చేశారు.

జాతీయ పోటీలకు 'మ్యాజికల్ వీల్ చైర్'

కర్నూలు కల్చరల్: నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ 2023–24కు 'మ్యాజికల్ వీల్ చైర్' ప్రాజెక్ట్ ఎంపికైంది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి 31వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో కర్నూలు నగరం అథేనా పాఠశాల విద్యార్థులు కౌశిక్‌రెడ్డి, గీతామాధురి ప్రదర్శించిన 'మ్యాజికల్ వీల్ చైర్' ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రాజెక్ట్ తయారు చేసిన విద్యార్థులు కె. కౌశిక్‌రెడ్డి, పి.గీతామాధురి, గైడ్ టీచర్ ఆసియా, జిల్లా సైన్స్ అధికారి ఎస్.రంగమ్మ, పాఠశాల యాజమాన్యాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అభినందించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో విద్యార్థులకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేసి జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య మాట్లాడుతూ.. బాల శాస్త్రవేత్తలు కర్నూలు పతాకాన్ని ఢిల్లీలో ఎగరవేసి విజయంతో తిరిగి వస్తారని అభిలషించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సృజన

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎస్ హెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి కురువ ఈశ్వర్(18) బ్రెయిన్‌స్ట్రోక్‌తో సోమవారం మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ చిన్న మాధవస్వామి, కృష్ణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెల సంతానం. వీరు వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి చిన్న కుమారుడైన కురువ ఈశ్వర్ కృష్ణగిరిలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ) చదువుకుంటున్నాడు. ప్రతి రోజు ఊరి నుంచి తొమ్మిది కిలోమీటర్లు బైక్‌పై పాఠశాలకు వెళ్లి చదువుకుని సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. సేలవు రోజుల్లో తల్లిదండ్రులకు వ్యవసాయంలో చెదోడువాడుగా ఉంటున్నాడు. ఈ నెల 10న ఆదివారం సెలవు రోజు కావడంతో కుటుంబసభ్యులతో కలిసి తమ పొలంలో వరి కోతకు వెళ్లాడు. వరి కోత కోస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన వారు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా కోలుకోలేక మృతి చెందినట్లు వారు తెలిపారు. ఉన్నత చదువులు చదివి తమకు అండగా ఉంటాడనుకున్న కుమారుడు అకాల మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


ఈశ్వర్(ఫైల్)